వరంగల్ వాయిస్
Evening Daily
www.warangalvoice.net
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 269
శుక్రవారం | 03 మే 2024 | పేజీలు : 08 | వెల రూ. 5




8 లో..

# జర భద్రం..

జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ హెచ్చరిక

ఎండ తీవ్రతకు గురికాకుండా జాగ్రత్తలు పాటిద్దాం

వివరాలు 2లో..

# విజయం మాదే..

# పీఎం రాహుల్ గాంధే



- ఓరుగల్లు గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురేస్తా..
- రేవంత్‌కు పెరుగుతున్న ప్రజాదరణ
- హస్తం పార్టీకి అండగా నిలుస్తున్న జనం
- బీజేపీ, బీఆర్ఎస్‌లకు ఓటమి భయం

## వరంగల్ వాయిస్ ఎడిటర్‌తో కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్య ప్రత్యేక ఇంటర్వ్యూ

వరంగల్ పార్లమెంట్ స్థానంపై కాంగ్రెస్ అధిష్ఠానం ప్రత్యేక దృష్టిని సారించింది. ఎలాగైనా గెలిచి తీరాలన్న కసితో ముందుకు సాగుతోంది. లోక్ సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లపై పూర్తి పట్టు సాధించేందుకు కసరత్తును ముమ్మరం చేసింది. ప్రత్యర్థి పార్టీల ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ విజయానికి దగ్గరవుతోంది. ఇప్పటికే వరంగల్ లోక్ సభ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలే ఉన్నందున విజయం నల్లేరుపై నడకలా మారింది. అయినప్పటికీ కాంగ్రెస్ లోక్ సభ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య సుడిగాలి పర్యటనలు చేస్తూ భారీ మెజార్టీతో గెలిచే వ్యూహాలు అమలు చేస్తున్నారు. ఎంపీగా విజయం సాధించి ఉమ్మడి వరంగల్ జిల్లా సమగ్రాభివృద్ధికి పాటుపడతానంటూ హామీ ఇస్తున్నారు. ఈ ఎన్నికలు భారతదేశ ముఖ చిత్రాన్ని మార్చే ఎన్నికలైనందున ఓటర్లు ఆలోచించి తగిన తీర్పు నివ్వాలంటూ విజ్ఞప్తి చేస్తున్నారు. ఓరుగల్లు గడ్డపై ఈ సారి కాంగ్రెస్ జెండా ఎగురవేస్తానంటున్న కడియం కావ్యతో వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి ప్రత్యేక ఇంటర్వ్యూ.

- గడ్డం కేశవమూర్తి



2లో

## వానాకాలం నుంచే పంటల బీమా

బీజేపీకి వ్యతిరేకంగా ఇండియా కూటమి

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు



8లో

## ఓట్ ఫర్ ష్యూర్

వినియోగదారుల సమాచార కేంద్రం ఆధ్వర్యంలో ఓటరు చైతన్య కార్యక్రమం

## మేడారానికి జాతీయ హెూదా

ఏపీలో కలిపిన ఐదు మండలాలు వెనక్కి

యువత, మహిళలు, రైతులు, కార్మికులకు న్యాయం

విభజన హామీల అమలుకు కృషి


తెలంగాణకు ప్రత్యేక మేనిఫెస్టో విడుదల చేసిన దీపాదాస్ మున్షీ



8లో

# విజయం మాదే..

# పీఎం రాహుల్ గాంధే



- గడ్డం కేశవమూర్తి

**ఓరుగల్లు గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురేస్తా..**

**హస్తం పార్టీకి అండగా నిలుస్తున్న జనం**

**రేవంత్‌కు పెరుగుతున్న ప్రజాదరణ**

**బీజేపీ, బీఆర్ఎస్‌లకు ఓటమి భయం**

**వరంగల్ వాయిస్ ఎడిటర్‌తో కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్య ప్రత్యేక ఇంటర్వ్యూ**

దేశంలో కాంగ్రెస్ పార్టీ విజయం తథ్యమని, రాహుల్ గాంధి ప్రధాని కావడం పక్కా అని ఆ పార్టీ వరంగల్ లోక్ సభ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య ధీమా వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా హస్తం పార్టీకి జనం అండగా నిలుస్తున్నారన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి గ్రాఫ్ దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. దీంతో బీజేపీ, బీఆర్ ఎస్ లకు ఓటమి భయం పట్టుకుందని, అందుకే అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణలో ప్రజా పాలన సాగుతోంది. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో మంత్రులు, ఎమ్మెల్యేలు అందరూ కలిసికట్టుగా పనిచేస్తున్నారన్నారు. అన్ని వర్గాలకు సమ న్యాయం జరుగుతోందని వివరించారు. దీంతో కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి మరింత ఆదరణ అభిస్తోందని, ఇక ఓరుగల్లు గడ్డపై తన గెలుపు పక్కా అన్నారు. వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తికి శుక్రవారం కడియం కావ్య ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా పార్టీ విజయావకాశాలపై సంపూర్ణ విశ్వాసం వ్యక్తం చేశారు.

### తెలంగాణ వ్యతిరేకి బీజేపీ..

కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ తెలంగాణకు ఇచ్చింది ఏమీ లేదు. లోక్ సభ సాక్షిగా ప్రత్యేక తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడారు. కులం, మతం పేరుతో బీజేపీ రాజకీయం చేస్తోంది. రాముడి పేరుతో ఆ పార్టీ అసత్యపు బాణాలు వేస్తోంది. బీజేపీ, బీఆర్ ఎస్ లు చీకటి మిత్రులు. ఇలాంటి దుష్టశక్తుల పార్టీలను తరిమికొట్టాలి. కాంగ్రెస్ పార్టీకి అధిక స్థానాలు దక్కేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి. గత పదేళ్లలో బీజేపీ, తెలంగాణ రాష్ట్ర సమితి తీసుకోలేని నిర్ణయాలను నాలుగు నెలల్లోనే సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ తీసుకుంది.

### మోడీవి ప్రజా వ్యతిరేక విధానాలు..

రైతులను కేంద్రం మోసం చేస్తోంది. దేశంలో రైతులకు నష్టం వాటిల్లే నల్ల చట్టాలను బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చింది. రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చి రైతులను పొట్టనబెట్టుకున్న ఘనత ప్రధానమంత్రి నరేంద్ర మోడీకే దక్కింది. ప్రజా వ్యతిరేక విధానాలతో పాలన సాగిస్తున్నారు. తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలి. అందుకు రాష్ట్రంలో అధిక ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఉంది. తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీకి పార్టీ అభ్యర్థుల గెలుపును బహుమతిగా అందించాలి. వరంగల్ నుంచి తనను గెలిపిస్తే ఈ ప్రాంతాన్ని మరింతగా అభివృద్ధి చేస్తానన్నారు.

### రాజ్యాంగాన్ని మార్చే కుట్ర..

దేశ రాజ్యాంగాన్ని మార్చేందుకు భారతీయ జనతా పార్టీ కుట్ర చేస్తోంది. ఈ ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించి మహనీయుడు అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి. ఆర్ఎస్ఎస్, బీజేపీల ఎజెండా ఒక్కటే. మోడీ 400 ఎంపీ సీట్లు గెలిస్తే రాజ్యాంగాన్ని రద్దు చేయాలని చూస్తున్నారు. ఆర్ఎస్ఎస్ శ్వేత పత్రంలో రాజ్యాంగం హిందూ వ్యతిరేకంగా ఉందని, దానిని మార్చాలని రాసి ఉందన్నారు. అందరికీ సమాన హక్కులు ఉండడం ఆర్ఎస్ఎస్ కు నచ్చదు. కాబట్టే అంబేద్కర్ రాజ్యాంగాన్ని రద్దుచేసి, మనస్మృతిని అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కుల గణన చేపట్టి రిజర్వేషన్ల శాతాన్ని పెంచుతామని డాక్టర్ కడియం కావ్య హామీ ఇచ్చారు.

### జన జాతర సభలతో విపక్షాల్లో వణుకు..

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహిస్తున్న జనజాతర సభలతో బీజేపీ, బీఆర్ ఎస్ పార్టీలు వణికిపోతున్నాయి. వీరి అహంకారం, అధికార దుర్వినియోగానికి తెలంగాణ ప్రజలు తగిన బుద్ధి చెప్తారు. కేంద్రంపై రేవంత్ రెడ్డి గట్టిగా కొట్లాడుతున్నందుకే మార్ఫింగ్ మిషతో ఢిల్లీ పోలీసులు ఆయనకు సమన్లు పంపారు. కాంగ్రెస్ ప్రచారాన్ని ఆపాలని కుట్రలు చేస్తున్నారు. ఢిల్లీ పెద్దలు రాష్ట్రానికి గాడిద గుడ్డు ఇచ్చారు. దేశవ్యాప్తంగా రైతులు, మహిళలు, నిరుద్యోగులు ఇలా అన్ని వర్గాలు కేంద్ర ప్రభుత్వంపై గుర్రుగా ఉన్నాయి. నకిలీ సర్వేలతో మోడీ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోంది. అతి ప్రచారం.. మైండ్ గేమ్ లతో ఆటలాడుతోంది. కాబట్టి బీజేపీ, బీఆర్ ఎస్ లకు ఓటు వేయొద్దు. ఎప్పటికైనా కాంగ్రెస్సే తెలంగాణకు శ్రీరామరక్ష అని పేర్కొన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది. రాహుల్ గాంధీ తప్పక ప్రధానమంత్రి అవుతారన్నారు.

### ఉద్యమాలకు కేరాఫ్..

ఓరుగల్లు అంటేనే ఉద్యమాలకు కేరాఫ్ అంటారు. కాకతీయుల ఘన చరిత్ర కలిగిన వరంగల్ అభివృద్ధిని గత బీఆర్ఎస్ ప్రభుత్వం గాలికొదిలేసింది. ఫలితంగా పేరు గొప్ప.. ఊరు దిబ్బగా వరంగల్ వాసికెక్కింది. వరంగల్ సమగ్రాభివృద్ధి నా ప్రధాన ఎజెండా. జిల్లా ప్రయోజనాలు, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తా. వరంగల్ లోకసభ పరిధిలో పెండింగ్ లో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా. విద్య, వైద్య రంగాల్లో మరిన్ని సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తా. రాష్ట్ర విభజన సమయంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు నిర్విరామ కృషి చేస్తా. రహదారులు, రైల్వే విస్తరణ పనుల కోసం ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు మేలు జరగాలంటే ఇక్కడ కాంగ్రెస్ గెలిచి తీరాలన్నారు. అధిక మెజారిటీతో తనను ఎంపీగా గెలిపించాలని కడియం కావ్య అభ్యర్థించారు.







# వానాకాలం నుంచే పంటల బీమా

**బీజేపీకి వ్యతిరేకంగా ఇండియా కూటమి**

**వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు**



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** దేశంలో కులాలు, మతాలు, ప్రాంతాల పరంగా రెచ్చగొట్టి అధికారం, అవకాశాల కోసం సార్వభౌమాధికారం, సమగ్రతను విచ్ఛిన్నం చేయాలని చూస్తున్న బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెస్, వామపక్ష పార్టీలు ఇండియా కూటమిగా ఏర్పడ్డాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలాజీ గార్డెన్ లో కాంగ్రెస్ పార్టీ లోక్ సభ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ గెలుపు కోరుతూ శుక్రవారం ఏర్పాటు చేసిన సీపీఐ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమావేశానికి అయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టులను, వ్యవస్థలను నిర్వీర్యం చేసి ఆర్థిక పరిస్థితిని దిగజార్చిందని, బీఆర్ఎస్ అనాలోచిత నిర్ణయాలతో పరిపాలన విధ్వంసమై స్కీములు, స్కాములయ్యాయన్నారు. లక్షల రూపాయలతో నిర్మించిన ప్రాజెక్టులు నిరూపయోగమయ్యాయని ధ్వజమెత్తారు. ప్రకృతి వైపరీత్యాలతో ఏ ఒక్క రైతు పంటలు నష్టపోవద్దని రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లించి, పంటల బీమా పథకాన్ని వచ్చే వానాకాలం సీజన్ నుంచే అమలు చేస్తుందని తెలిపారు. పంట నష్టపోయినా, దిగుబడులు తగ్గినా పంట నష్ట పరిహారం అందుతుందన్నారు. ఆరు గ్యారెంటీలలో ఐదు ఇప్పటికే అమలు చేశామని, ఆగస్టు 15 వరకు రూ.2 లక్షల రుణమాఫీని అమలు చేస్తామని హామీనిచ్చారు. కేంద్రం నుంచి పోడు భూములకు పట్టాలు, జాతీయ రహదారుల మంజూరు అనుమతులు త్వరితగతిన తీసుకురావాలంటే కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి బలరాం నాయక్ ను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబ శివరావు, మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బలరాం నాయక్, ఎమ్మెల్యే మురళీ నాయక్, సీపీఐ జిల్లా కార్యదర్శి విజయ్ సారధి, కాంగ్రెస్, సీపీఐ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు ప్రాధాన్యంపై అవగాహన



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిల్లా యూత్ స్పోర్ట్స్ అథారిటీ ఓ సిటీ వరంగల్ స్టేడియంలో ఉదయం 7:30 గంటలకు వాకర్ అసోసియేషన్ సభ్యులకు, వివిధ క్రీడలలో కోచింగ్ తీసుకుంటున్నయువకులకు, బాలురకు సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ వరంగల్ ప్రతినిధులు కలిసి ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు కొన్ రెడ్డి మల్లారెడ్డి మాట్లాడుతూ లోక్ సభ ఎలక్షన్ 2024 పురస్కరించుకొని వరంగల్ నగరంలోని అందరం ఓటింగ్ శాతాన్ని పెంచడానికి ప్రతి ఒక్కరం కృషి చేయాలని కోరారు. గ్రామాలలో 90 శాతం పైగా ఓటు వేస్తున్నారు. వరంగల్ నగరంలో 60 శాతం లోపలనే ఓటింగ్ శాతం పడుతోంది, ఈ విషయాన్ని గమనించి ప్రతి ఒక్కరం ఈ నెల 13న సామాజిక బాధ్యతగా భావించి ఓటు వేద్దామని పిలుపునిచ్చారు. 90 శాతం ఓటు వేయడానికి ప్రయత్నిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నిమ్మకాయల సదానందం, నన్నపు సంజీవరావు కార్యనిర్వాహ కార్యదర్శి, కార్యవర్గ సభ్యులు వెంకటమల్లు, జి.నరసింహా రాములు, డి.రాజమౌళి, ఏ.రాజేంద్రప్రసాద్, ఎం.లింగమూర్తి, వారణాసి మోహన్, భాస్కర్, కాశిబుగ్గ సీనియర్ సిటిజన్ మిత్రులు, వాకర్ అసోసియేషన్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## అరూరి విశాల్ ఇంటింటి ప్రచారం



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** మండలంలోని కడారి గూడెం గ్రామంలో భారతీయ జనతా పార్టీ వరంగల్ లోక్ సభ అభ్యర్థి అరూరి రమేష్ కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఇంటింటి ప్రచారం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అరూరి విశాల్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రచారం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గత పది సంవత్సరాలుగా భారతదేశాన్ని ఏ విధంగా అభివృద్ధి చేస్తున్నారో ప్రజలంతా చూశారని, మూడవసారి ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ మళ్లీ గెలవడం ఖాయమని, అదేవిధంగా వరంగల్ లోక్ సభ భారతీయ జనతా పార్టీ అభ్యర్థి అరూరి రమేష్ ను ఓటర్లు తమ అమూల్యమైన ఓటు వేసి ఆశీర్వదించాలని ఈ సందర్భంగా విశాల్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. వారితో పాటు మండల అధ్యక్షుడు రాయపూరపు కుమార స్వామి, జిల్లా నాయకుడు కుందూరు మహేందర్ రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి పింగళి సంపత్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు పింగిలి రాజేందర్ రెడ్డి, జిల్లా నాయకుడు గుండ్ల సుభాష్, బూత్ అధ్యక్షులు ఎల పాటి తిరుపతిరెడ్డి, బూత్ కమిటీ సభ్యులు పింగిలి నరేందర్ రెడ్డి, వంగాల రాజేందర్ రెడ్డి, పింగిలి యుగేందర్ రెడ్డి, కంజర్ల కనకయ్య, రూపురెడ్డి, యాదవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మారేపల్లి సుధీర్ కుమార్‌ను గెలిపించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ లోక్ సభ ఎన్నికల సందర్భంగా హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి డా.మారేపల్లి సుధీర్ కుమార్ గెలుపే ధ్యేయంగా కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్తిస్తు శుక్రవారం 8వ డివిజన్ 3-3 బ్లాక్ ఏనుగులగడ్డలో బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 8వ డివిజన్ అధ్యక్షుడు పులి విక్రమ్, మాజీ అధ్యక్షులు పానుగంటి శ్రీధర్, చింతకుల ప్రభాకర్, బోయిని విజయ్, పల్లెమెన రమేష్, దేవులపల్లి ప్రదీప్, ఎర్రోజు భాస్కర్, అశోక్, రుద్రోజు సంపత్ పాల్గొన్నారు.

# సంరక్ష హాస్పిటల్ వైద్య సేవలు ప్రశంసనీయం

**విజయవంతంగా 23 ఉచిత డయాబెటిక్ స్క్రీనింగ్ క్యాంపులు**

**అందరికి అందుబాటులో అత్యాధునిక వైద్య సేవలు**

**సంరక్ష హాస్పిటల్ యాజమాన్యం**




**వరంగల్ వాయిస్, ఖిలా వరంగల్ :** తెలంగాణ తల్లి విగ్రహం దగ్గర పడమర కోట ఖిలా వరంగల్ లో శుక్రవారం సంరక్ష హాస్పిటల్ ఆధ్వర్యంలో డయాబెటిక్ స్క్రీనింగ్ క్యాంప్ విజయవంతంగా నిర్వహించారు. నేటితో మొదటి విడతలో 23 ఉచిత డయాబెటిక్ స్క్రీనింగ్ క్యాంపులు గ్రాండ్ సక్సెస్ గా ముగిశాయని సంరక్ష హాస్పిటల్ ప్రతినిధులు తెలిపారు. సంరక్ష హాస్పిటల్ వైద్య సేవలు ప్రశంసనీయమని అని ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక కార్పొరేటర్ దామోదర్ యాదవ్, అతిథులు నలిగంటి రత్నమాల, మండల పరుశరాములు అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజల వద్దకు మరిన్ని వైద్య సేవలు విస్తరిస్తామని, అందరికి అందుబాటులో అత్యాధునిక వైద్య సేవలు, ఉన్నత ప్రమాణాలతో అందిస్తామని సంరక్ష హాస్పిటల్ వైస్ చైర్మన్ డాక్టర్ కాసర్ల తిరుపతి రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ దిడ్డి శ్రవణ్ కుమార్, మెడికల్ డైరెక్టర్, ప్రముఖ డయాబెటిస్ స్పెషలిస్ట్ సీనియర్ ఫిజిషియన్ డాక్టర్ అజిత్ మహమ్మద్, డైరెక్టర్ డాక్టర్ పోలా నటరాజ్ తెలిపారు. సంరక్ష హాస్పిటల్ ఉచిత వైద్య సేవలు, ఆరోగ్యశ్రీ వైద్య సేవలు, హాస్పిటల్ వైద్య సేవలు బాగున్నాయని స్థానిక కార్పొరేటర్ దామోదర్ యాదవ్ అన్నారు. ఆరోగ్య వంతమైన సమాజం కోసం, షుగర్ వ్యాధి పట్ల జాగ్రత్త వహించి ఉండాలన్నారు. షుగర్ వ్యాధి వలన శరీరంలోని అన్ని అవయవాలు మెల్లగా దెబ్బతింటాయని, షుగర్ వ్యాధి నియంత్రణలో ఉండేటట్టు చూసుకోవాలని సూచించారు. మారుతున్న ఆహారపు అలవాట్లతో, సరైన వ్యాయమం లేకపోవటం వలన షుగర్ వ్యాధిన పడే వారి సంఖ్య భారీగా పెరుగుతుందని తెలిపారు. కాబట్టి, ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకొని, షుగర్ టెస్ట్ రెగ్యులర్ గా చేయంచు కోవాలని కోరారు. ఈ క్యాంప్ లో 136 మందికి ( స్త్రీ ,పురుషులకు ) ఉచితంగా రక్త పరీక్షలు, వైద్య సేవలందించారు. అందులో 35 మందికి మధుమేహం, రక్తపోటును (క్రొత్తవి %ఆ% పాతవి )గుర్తించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంరక్ష హాస్పిటల్ సిబ్బంది, రవి కిరణ్, సురేష్, సృజన్, సారిక, రమాదేవి, సుమలత, స్వర్ణలత, రాజకుమార్, అశోక్, రాజు, రమేష్ తదితరులు పాల్గొని వైద్య శిబిరంలో సేవలందించారు. స్థానికులు గూడూరు దయాకర్, సారంగపాణి, శ్రీనివాస్, భవాని పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముమ్మర ప్రచారం



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** మండలంలోని పెద్దంపేట గ్రామంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శ్రీను బాబు ఆదేశాల మేరకు శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి వంశీక్రిష్ణను గెలిపించి రాహుల్ గాంధీని ప్రధాని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు అక్బర్ ఖాన్, జడ్పీటీసీ గుడాల అరుణ శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి మాజీ సర్పంచ్ విలాస్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కామిడీ శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు వామన్ రావు, వరప్రసాద్, మహిళ నాయకురాలు ఒడేటి పద్మ, మాజీ సర్పంచ్ బల పోషం, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు లేతకరి రాజబాబు, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు చంద్రమౌళి మండల ప్రధాన కార్యదర్శి శంకరయ్య, తిరుపతి రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు షకీల్, నాగరాజు, రాఘువేంద్ర, సమ్మయ్య, సంజీవ్ పాల్గొన్నారు

## వృద్ధులకు ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం



**వరంగల్ వాయిస్, దామెర :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, హనుమకొండ మొబైల్ మెడికేర్ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం హనుమకొండ జిల్లా దామెర మండలంలోని లాదెళ్ల గ్రామంలోని గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో 60 సంవత్సరాలు పైబడిన వయోవృద్ధులకు ఉచిత సంచార వాహన వైద్య సేవల ఆరోగ్య శిబిరం హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పి.విజయచందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డిల ఆదేశానుసారం ఏర్పాటు చేశారు. ఈ ఆరోగ్య శిబిరాన్ని రెడ్ క్రాస్ రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈవీ శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు బిల్లా రమణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈవీ. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం డిపార్ట్ మెంట్ ఆఫ్ ఎంపవర్ మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిసెబిలిటిస్, సీనియర్ సిటిజన్స్, భారత ప్రభుత్వ సహకారంతో 60 సంవత్సరాలు పైబడిన వయో వృద్ధులకు ఇంటి వద్దనే సేవలనందించేందుకు హనుమకొండ రెడ్ క్రాస్ సంచార వైద్యశాల సేవలు అందిచడం జరుగుతుందన్నారు. ప్రతి నెల మీ గ్రామానికి వచ్చి క్యాంపు నిర్వహించి వృద్ధులకు బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించటం జరుగుతుందని, ఇలాంటి వైద్య శిబిరాలను గ్రామాలలోని వృద్ధులంతా సద్వినియోగం చేసుకోవాలని పాలకవర్గం కోరారు. రెడ్ క్రాస్ డాక్టర్లు డా.జి. కిషన్ రావు, డా.మొహమ్మద్ తహర్ మసూద్, రెడ్ క్రాస్ సిబ్బంది గుల్లెపెల్లి శివకుమార్, గంగాధర్, పవన్, రమేష్, శ్రీకాంత్, గ్రామస్తులు వృద్ధులు పాల్గొన్నారు.

# కేసీఆర్ హయాంలో పొలాలకు నీరు

## దాస్యం వినయ్ భాస్కర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం రామన్నపేట పరిధిలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి డా. సుధీర్ కుమార్ ఎన్నికల ప్రచారం వరంగల్ లోని 11, 29వ డివిజన్లలో నిర్వహించారు. రామన్నపేట బొడ్రాయి దగ్గరి నుంచి ప్రచారం ప్రారంభించారు. బీఆర్ఎస్ కుటుంబ సభ్యులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేసి బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రామన్నపేటకు చెందిన యువత పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో పొలాలకు నీరు ఇచ్చారని, కాంగ్రెస్ కరువు తెచ్చిందనీ విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కేసీఆర్ బస్సు యాత్రకు ప్రజల్లో అనూహ్య స్పందన వచ్చిందన్నారు. ప్రజల్లో వచ్చిన ఆదరణ, ప్రేమ చూసి భయపడి కేసీఆర్ ప్రచారాన్ని ఆపారని అన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా బీఆర్ఎస్ తరపున ప్రచారం చేస్తున్నారని, కొందరు పార్టీ పదవులు పొంది, పార్టీ వీడి పోయారని విమర్శించారు. కాంగ్రెస్ దొంగ హామీలు అమలు చేసే వరకు కొట్లాడుతామని అన్నారు. రామన్నపేట యూత్ పార్టీలో చేరడం అభినందనీయని, రెండు జాతీయ పార్టీలకు (బీజేపీ, కాంగ్రెస్ లకు)ఓటు తో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అనంతరం వరంగల్ లోక్ సభ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మారేపల్లి సుధీర్ కుమార్ మాట్లాడుతూ నేను ఒక కార్యకర్తనని మోడీ బీజేపీ, రేవంత్ కాంగ్రెస్ పార్టీలు ఒక్కటే అని అన్నారు. ఇక్కడ పదవి అనుభవించి వెళ్లిన వారికి బుద్ధి చెప్పాలని, కడియం వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అనతి కాలంలోనే విఫలమైన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని దుయ్యబట్టారు. కేసీఆర్ చేపట్టిన బస్సు యాత్ర ద్వారా ప్రజల్లో వచ్చే ఆదరణ చూసి ఓర్వలేక కాంగ్రెస్,బీజేపీ పార్టీ లు కుట్ర పన్ని బస్సు యాత్రపై ఎన్నికల కమిషన్ కు పిర్యాదు చేసి 48 గంటల పాటు నిషేధింప చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ పరీక్షలు వాయిదా వేయాలని విద్యార్థుల ధర్నా



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఈ నెల 6 నుంచి జరిగే డిగ్రీ 2, 4, 6వ సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని వివిధ డిగ్రీ కళాశాల విద్యార్థులు శుక్రవారం కాకతీయ యూనివర్సిటీ ఎగ్జామినేషన్ బ్రాంచ్ ముందు ధర్నా చేశారు. అనంతరం పరీక్షల నియంత్రణ అధికారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు యూనివర్సిటీ రిజిస్టార్ మల్లారెడ్డిని కలవడానికి వెళ్తే మేము పరీక్షలు వాయిదా వేయమని, ఎవరైనా అనారోగ్యానికి గురైన మాకు సంబంధం లేదంటూ విద్యార్థులకు చెప్పడంతో విద్యార్థులకు రిజిస్టార్ కు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. అందులో రిజిస్టార్ మల్లారెడ్డి కలవడానికి వచ్చిన విద్యార్థులను చదువు రాని వాళ్లే పోరాటాలు చేస్తారంటూ చదువు చేతకాని వాళ్లే యూనివర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ భవనం మెట్లు ఎక్కుతారంటూ విద్యార్థులను అవహేళనగా మాట్లాడారు.. విద్యార్థులు ఎంత చెప్పినా వినకుండా మేము పరీక్షలు పెట్టే తీరుతామని, మీరు ఏం చేస్తారో చేసుకోండి అనడంతో ప్రభుత్వ కాకతీయ డిగ్రీ కళాశాల విద్యార్థి నాయకుడు ఉప్పుల శివ మాట్లాడుతూ ఒకవైపు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వేసవికాలం ఎండ తీవ్రతకు అత్యవసరమైతేనే బయటికి రావాలని ఆదేశాలు జారీ చేసినా కూడా కాకతీయ యూనివర్సిటీ అధికారులు నిమ్మకు నీరెత్తనట్లు ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. రోజురోజుకు ఎండ తీవ్రత పెరుగుతూ ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని, ఈ క్రమంలో పరీక్షలు నిర్వహించడం సబబు కాదన్నారు. ఎండ తీవ్రతతో పాటు ఎన్నికలను కూడా పరిగణలోకి తీసుకుని కాకతీయ యూనివర్శిటీ పరిధిలోని డిగ్రీ పరీక్షలను వెంటనే వాయిదా వేయాలని వారు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నత విద్యా శాఖ మండలి స్పందించి వెంటనే డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలన్నారు. ఈ పరీక్షలు నిర్వహించడం వల్ల ఏ ఒక్క విద్యార్థి అనారోగ్యానికి గురైనా, మరణించిన అదీ కాకతీయ యూనివర్సిటీ అధికారుల బాధ్యత అని విద్యార్థులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ విద్యార్థులు అనిల్, శరత్, రవికుమార్, సంగీత శిరీష, కళ్యాణి, దీక్ష, అంకిత, రుద్రాణి, 30 మంది తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

# అతుల్ కుమార్ అంజన్ మృతి తీరని లోటు

## తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఆల్ ఇండియా కిసాన్ సభ జాతీయ ప్రధానకార్యదర్శి కామ్రేడ్ అతుల్ కుమార్ అంజన్ మృతి ప్రజా ఉద్యమాలకు తీరనిలోటని బీకేఎంయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. ఆల్ ఇండియా కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి, సీపీఐ జాతీయ కార్యదర్శి కామ్రేడ్ అతుల్ కుమార్ అంజన్ శుక్రవారం ఉదయం ఉత్తర ప్రదేశ్ లోని లక్నోలో అనారోగ్యంతో మృతి చెందడం పట్ల భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడే తాటిపాముల వెంకట్రాములు ప్రగాఢ సంతాపం ప్రకటించి వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. అంజన్ అఖిల భారత విద్యార్థి సమాఖ్య జాతీయ అధ్యక్షుడిగా విద్యార్థి, యువజన ఉద్యమాలకు నాయకత్వం వహించారు. లక్నో యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. రైతాంగ సమస్యలపై అధ్యయనం చేసి సిఫార్సులు చేయడానికి కేంద్ర ప్రభుత్వం నియమించిన స్వామినాథన్ కమిషన్ సభ్యుడిగా క్రియాశీలక పాత్ర పోషించారు. .కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా రైతాంగ ప్రయోజనాలను కాల రాసేందుకు తెచ్చిన నల్ల చట్టాలకు వ్యతిరేకంగా సాగిన పోరాటానికి, కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరిగిన అనేక పోరాటాలకు నాయకత్వం వహించారు. వారి ఆకస్మిక మరణం ప్రజా ఉద్యమాలకు తీరనిలోటని వెంకట్రాములు జోహార్లు అర్పించారు. వారి ఆశయాల సాధనకై ప్రజా ఉద్యమాలు నిర్మించడమే వారికి నిజమైన నివాళులని అన్నారు.

# దేశ ప్రజలకు మోడీ పాలన అవసరం

## బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్



**వరంగల్ వాయిస్, దామెర :** లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా దామెర మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్ లో వరంగల్ లోక్ సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికల్లో ముచ్చటగా మూడోసారి మోడీని గెలిపించడం కోసం ప్రతి ఒక్కరూ కలిసి రావాలన్నారు. తనకు ప్రజల్లో లభిస్తున్న ఆదరణ చూడలేక కాంగ్రెస్ పార్టీ నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తన పైన ఆరోపణలు చేయడం కాదు.. ఉమ్మడి వరంగల్ జిల్లాకు కాంగ్రెస్ ఏమీ చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికే గ్యారంటీ లేదు... హామీలు ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. దేశంలో పేద ప్రజలకు 5 కిలోల ఉచిత బియ్యం అందిస్తున్నది మోడీ ప్రభుత్వమేనని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రిజర్వేషన్ల మీద చేస్తున్న అబద్ధపు ప్రచారాలను ఆపాలన్నారు. ఎవరూ ఎన్ని అడ్డంకులు సృష్టించిన నా గెలుపు ను ఆపలేరని ధీమా వ్యక్తం చేశారు. తను గెలిచాక వరంగల్ లోక్ సభ ప్రజలకు అందుబాటులో ఉంటూ నిరంతరం ప్రాంత అభివృద్ధికి పాటు పాడుతానని హామీ ఇచ్చారు. నా గెలుపు బాధ్యత మీది.. మిమ్మల్ని కాపాడుకోనే బాధ్యత నాదని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట కార్యవర్గ సభ్యులు డాక్టర్ ప్రేమెందర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు కాళి ప్రసాద్, మంద ఐలయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సత్యనారయణ, జిల్లా అధ్యక్షుడు శ్రీరాం రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు జంగిలి నాగరాజు, శక్తి కేంద్ర ఇంచార్జి రమేష్, రాజ్ కుమార్, రతన్ కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వారణాసి బరిలో బరిగెల శివ



**వరంగల్ వాయిస్, వారణాసి :** రాజ్యాధికారంమే అంతిమ లక్ష్యంగా పోరాడుతున్న బరిగెల శివ తనకు దేశం మద్దతు తెలుపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీపై వారణాసి నుంచి తాను పోటీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మహానీయుడు బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగానికి ప్రమాదం ఉందని, ఈ నేపథ్యంలో వారణాసి పోరుకు తాను సిద్ధపడినట్లు బరిగెల శివ వెల్లడించారు. మన ఓటు మనం వేసుకుంటే అంబేద్కర్ ఆశయం నెరవేరినట్టేనని పిలుపునిచ్చారు. అందుకే మహనీయులు ఆశయం కోసం గత 8 అవసరాల నుంచి జై భీమ్ టీవీ, జై భీమ్ గ్రూప్ అఫ్ ఆర్గనైజేషన్స్ నడిపిస్తూ ఎంతోమందికి ఉద్యోగ అవకాశం కల్పిస్తున్నానని తెలిపారు. అంబేద్కర్ చెప్పినట్టుగా రాజ్యాధికారంమే అంతిమ లక్ష్యంగా గతంలో ఇద్దరు ముఖ్యమంత్రులపై కామారెడ్డిలో పోటీ చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం దేశ ప్రధాని వారణాసి వరంగల్ ఎంపీగా పోటీ చేస్తున్నానని, వారణాసిలో రాజ్యాంగాన్ని పట్టుకొని నేను నామినేషన్ వేయడానికి సిద్ధంగా ఉన్నానని అన్నారు.

# ఉపాధి హామీ పథకం తెచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమే



**వరంగల్ వాయిస్, నడికూడ :** లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా నడికూడ మండల కేంద్రంలో 400 మంది ఉపాధి హామీ కూలీలకు నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మజ్జిగా ప్యాకెట్లను పంపిణి చేశారు. నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రచారాన్ని నిర్వహించారు. వరంగల్ లోక్ సభ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య గెలుపునకు కృషి చేయాలని ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి ప్రచారం నిర్వహించి వారితో ముచ్చటించి చెయ్యి గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో కడియం కావ్యను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్ మాట్లాడుతూ పల్లెల్లో ప్రజలందరికి ఉపాధి కల్పించి, ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు 2006లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించిందన్నారు. 100 రోజుల పనిని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొస్తే ఇప్పుడున్న బీజేపీ ప్రభుత్వం 40 రోజులకు దిగజార్చిందని అన్నారు. పల్లెల్లో పేదల కడుపు నింపటంలో ఉపాధి హామీ పథకం ప్రధానమైందని, వంద రోజుల పని దినాలతో కోట్లాది మంది పేదలు సంతోషంగా జీవిస్తున్నారని నమ్మకం వెలిబుచ్చారు. ఇలాంటి మహోత్తమైన పథకాల రూపకల్పన చేసిన కాంగ్రెస్ పార్టీని కేంద్రంలో గెలిపించుకొని రాహుల్ గాంధీని ప్రధానిగా చెసుకుందామని మరెన్నో పథకాలను పేదలకు కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శి డాక్టర్ కుడ్ల మలహాల్ రావు, జడ్పీటీసీ సుమలత –కరుణాకర్, నడికూడ గ్రామా కమిటీ అధ్యక్షుడు తాళ్ల నవీన్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అప్పం కుమారస్వామి, గ్రామ కమిటీ మహిళా అధ్యక్షురాలు తరాబాయి, గ్రామా కమిటీ ప్రధాన కార్యదర్శి జీలా శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపెల్లి యుగేందర్, దుప్పటి సదానందం, బూర మహేందర్, అరుణ్, విజేందర్, నేరేటి రజిత, రావుల సురేష్, బుర్ర నాగరాజు, బుర్ర నరేష్, మహిళా కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# కడియం కావ్యను గెలిపించాలి



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని 36వ బూత్ లో వరంగల్ లోక్ సభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య చేతి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ఇంటింటికి తిరుగుతూ పట్టణ సీనియర్ కాంగ్రెస్ నాయకులు చెరుపల్లి మొగిలి కోరారు. అంతేగాక రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యంగా మనమందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ పాటుపడి వరంగల్ లోక్ సభ అభ్యర్థి కడియం కావ్యను గెలిపించి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవాలన్నారు. కౌన్సిలర్ పసుల రమేష్, పసుల భద్రయ్య, మంద నాగరాజు, పసుల విజయ 36 బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# పాత పెన్షన్ పునరుద్ధరించే పార్టీకే మా మద్దతు

## దొడ్డిపాటి హరికుమార్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పాత పెన్షన్ పునరుద్ధరణ చేస్తామని హామీ ఇచ్చిన పార్టీకే త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఉద్యోగ, ఉపాధ్యాయుల మద్దతు ఉంటుందని తెలంగాణ రాష్ట్ర కంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఉమ్మడి వరంగల్ జిల్లా డిపార్ట్మెంట్ ఫోరం కన్వీనర్ హరికుమార్ దొడ్డి పాటి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసి మాట్లాడుతూ ఉద్యోగి జీవిత కాలం పని చేసి, పదవీ విరమణ తర్వాత భద్రత కోసం సాధించుకున్న పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, సీపీఎస్ అంటూ పాలక ప్రభుత్వాలు ఉద్యోగుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టివేయడం ఆందోళన కరమని అన్నారు. పార్లమెంట్, శాసన మండలి ఎన్నికలు సమీపిస్తున్న ప్రస్తుత తరుణంలో ఎవరైతే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని ఖచ్చితమైన హామీ ఇస్తారో ఆ పార్టీకే ఉద్యోగ ఉపాధ్యాయులు ఓటు వేస్తారని అన్నారు. ఎన్నికల్లో రాజకీయ పార్టీలు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చేందుకు ఒత్తిడి తీసుకువస్తామని, తమ డిమాండ్లను నెరవేర్చే పార్టీకి మాత్రమే తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆయన తెలిపారు.

# ఓటు వేయటం బాధ్యత




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఓటు వేయటం మా బాధ్యత, మేము ఓటేయటమే కాకుండా మా ఆటోలో ప్రయాణించే ప్రయాణికులను కూడా తప్పకుండా ఓటు వేయాలని తమ వంతు బాధ్యతగా చెబుతామంటూ రామలింగేశ్వర ఆటో డ్రైవర్ యూనియన్ భట్టుపల్లి ఆటో డ్రైవర్లు ఓటరు ప్రమాణం చేశారు. ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ నెల రోజులపాటు ఓటింగ్ శాతాన్నిపెంచటానికి నిర్వహిస్తున్న అవేర్నెస్ కార్యక్రమంలో భాగంగా ఫాతిమా నగర్ బ్రిడ్జి వద్ద ఆటో అడ్డా డ్రైవర్లకు రికార్డ్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు కుసుమ సురేష్ తో కలిసి శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తీవ్రమైన ఎండ ఉన్న లెక్క చేయక ఆటో డ్రైవర్లు ఈ కార్యక్రమంలో పాల్గొని, ప్లకార్డులు ప్రదర్శించి తప్పక ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేశారు. విజయ్, రాజు, రాజ్ కుమార్, ప్రవీణ్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## బాటసారులకు మజ్జిగ వితరణ




**వంగల్ వాయిస్, హనుమకొండ :** స్థానిక చౌరస్తాలో వీరశైవ లింగాయత్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న మజ్జిగ, చల్లని తాగునీటి పంపిణీ కార్యక్రమానికి బాటసారులు, ఆటో రిక్షా నిర్వాహకులు, ప్రయాణికుల నుంచి విశేష స్పందన లభిస్తుంది. ప్రతిరోజు ఉదయం 11:30 నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఈ సంఘం ద్వారా వీటిని అందజేస్తుండడంతో అధిక సంఖ్యలో ప్రజలు, చిరు వ్యాపారులు ఊరట పొందుతూ సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. నగరంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న ఏకైక సంఘం వీరశైవ లింగాయత్ సమాజానిదేనని పేర్కొంటూ శుభాకాంక్షలు- అభినందనలు తెలియజేస్తున్నారు. శుక్రవారం విశేషంగా హనుమకొండ చౌరస్తాలో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న గంగాధరి రమేష్- ఈ సేవా కార్యక్రమాన్ని, ప్రజల వేసవి తాపాన్ని చూసి ప్రభావితులై ఒక మజ్జిగ డబ్బాను కొనుగోలు చేసి ఈ చలివేంద్రం వద్ద బాటసారులకు పంపిణీ చేయడం వారి సహృదయతకు నిదర్శనం. ఎండ తీవ్రత వలన అల్లాడుతున్న ప్రజలకు ఉడతా భక్తిగా సేవనందించాలన్న ఉద్దేశంతో సంఘం పరంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఈ అవకాశం లభించడం మాకెంతో సంతృప్తిని కలిగిస్తున్నదని సంఘం ప్రతినిధులు నానం రాజయ్య, గుండవరం విధు మౌళి, సూరం సురేష్ బాబు తెలియజేశారు.

## మచ్చలేని నాయకుడు నరేంద్ర మోడీ



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలోని చింత నెక్కొండ గ్రామంలో భారతీయ జనతా పార్టీ లోక్ సభ అభ్యర్థి అరూరి రమేష్ గెలుపు కోసం కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కుడికాల శ్రీధర్ మాట్లాడుతూ గల్లీలో ఎవరున్నా ఢిల్లీలో మాత్రం నరేంద్ర మోదీ ఉండాలని ప్రతి ఇంటికి వెళ్లి ప్రచారం చేయడం జరిగిందన్నారు. ప్రచారంలో ప్రజలందరూ ఈసారి కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఉండాలని, వరంగల్ పార్లమెంటు అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని తెలిపారని అన్నారు. 10 సంవత్సరాల కాలంలో ఇప్పటివరకు అవినీతి మచ్చలేని నాయకుడు నరేంద్ర మోదీ అని కొనియాడారు. ప్రతి ఒక్కరూ పార్టీలకతీతంగా కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి నరేంద్ర మోదీని బలపరచాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వీరారపు పిచ్చిరెడ్డి, బత్తిని దేవేందర్, థౌడోజు సాంబయ్య, ఓరుగంటి కుమార్, పిల్లల రాములు నాయకులు పాల్గొన్నారు.

## వేసవిలో ఆయిల్ ఫామ్ తోటలను కాపాడుకోవాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** వేసవిలో ఆయిల్ ఫామ్ తోటలను కాపాడుకోవాలని, మార్కెట్ లో డిమాండ్ ఉన్న పంటలు సాగు చేయాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు. మరియన్న రైతులకు సూచించారు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లాలో పలు ఆయిల్ పామ్ తోటలను జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు. మరియన్న సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయిల్ పామ్ రైతులకు వేసవి యాజమాన్యం, కలుపు యాజమాన్యం, గ్రీన్ మ్యాన్యుర్ (పచ్చి రొట్ట ఎరువులు),అంతర్ పంటల గురించి, ఎరువుల వాడకం గురించి రైతుకు పలు సాంకేతిక సలహాలు సూచనలు చేశారు. అలాగే నూతన రైతులు పంట మార్పిడి చేసి, మార్కెట్ డిమాండ్ ఉన్న ఆయిల్ పామ్, ఉద్యాన పంటలు, మల్బరీ తోటలు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ అధికారి నాగరాజు, రైతులు ప్రతాపనేని. పుల్లయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల రావుకు
## వరంగల్ సీజీఆర్ఎఫ్ చైర్మన్‌గా అదనపు భాద్యతలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** టెక్నికల్ మెంబర్‌గా కొనసాగుతున్న కె.తిరుమల రావు శుక్రవారం వరంగల్ సీజీఆర్ఎఫ్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఇంజినీర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాలువా, పూల మొక్కతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీజీఎం ఆపరేషన్ కె.కిషన్, జీఎం మల్లికార్జున్, డీఈలు బి. సామ్య నాయక్, రాంబాబు, శ్రీధర చారి , ఏడీఈ లు కిరణ్, మధుకర్, అశోక్, ఈఈ జనార్దన్, ఏఈలు, వివిధ సంఘాల నాయకులు, ఉద్యోగులు తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలి



## జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఈనెల 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా పోలింగ్ కేంద్రాల వద్ద కనీస సదుపాయాల కల్పన త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జూమ్ మీటింగ్ ద్వారా జిల్లాలోని మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంపీఓలు, సెక్టార్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వైద్యాధికారులు, ఐసీడీఎస్ సూపర్ వైజర్లతో పోలింగ్ కేంద్రాల వద్ద కనీస సదుపాయాల ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల పరిధిలోని పోలింగ్ కేంద్రాలలో తాగునీరు, విద్యుత్ లైట్లు, పారిశుద్ధ్య నిర్వహణ, షేడ్ నెట్ల ఏర్పాటు , ఫ్యాన్లు, పోలింగ్ సిబ్బందికి భోజన, వైద్య సేవలు, తదితర సదుపాయాల కల్పనపై అధికారులను కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు.

మే 10 నాటికి అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసి ఉంచాలన్నారు. ఈ నెల 5 లోగా ఓటరు సమాచార చీటీల పంపిణీ వంద శాతం పూర్తి చేయాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద వయోవృద్ధులు, దివ్యాంగులకు సరైన ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. వేసవి దృష్ట్యా పోలింగ్ కేంద్రాల వద్ద నీడ, త్రాగునీరు, వైద్య సేవలతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచాలన్నారు. సెక్టార్ అధికారులు పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లను పోలింగ్ కు ముందే పరిశీలించాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ కౌసల్య దేవి, డీపీఓ కల్పన, డీఎంహెచ్ ఓ డాక్టర్ వెంకట రమణ, ఇతర నోడల్ అధికారులు కలెక్టరేట్ పర్యవేక్షకులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కష్టపడి చదివే పేద పిల్లలకు అండగా ఉంటా

## డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ జిల్లా (మే 3) కోమటిపల్లి గ్రామానికి చెందిన పేద విద్యార్థిని పోగుల సంయుక్త జేఈఈ పరీక్షలో మంచి మార్కులు సాధించిన విద్యార్థినికి కాంగ్రెస్ నేత, డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణఅభినందనలు తెలియజేసి శాలువాతో సత్కరించారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చదువే మనల్ని ముందుకు నడిపిస్తుందని, చదివే అన్నిటికీ మూలాధారం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చూపించిన బాటలో ప్రతి ఒక్క విద్యార్థి విద్యార్థినులు నడవాలని ఆయన అన్నారు. చదవాలని ఉన్న ఇంట్లో ఉన్న ఆర్థిక ఇబ్బందుల వల్ల చదవలేక పోతున్నా, చదవాలన్న పట్టుదల ఉన్న ప్రతి ఒక్క విద్యార్థులకు రామకృష్ణ చారిటబుల్ ట్రస్టు ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారికి తోడుంటానని డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ తెలియజేశారు

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో అవకాశం ఇవ్వండి

### మేకల కేదారి యాదవ్



**వరంగల్ వాయిస్, కాజీపేట :** వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఉప ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ తరఫున ఎమ్మెల్సీగా పోటీ చేయడానికి అవకాశం కల్పించాలని జిల్లాలో ఉన్న మాజీ హనుమకొండ శాసనసభ్యుడు, బీజేపీ తెలంగాణ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ మార్తినేని ధర్మారావు, మాజీ ఎమ్మెల్యే, మాజీ వరంగల్ నగర మేయర్ తక్కళ్లపల్లి రాజేశ్వరరావు, హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మలకు వినతి పత్రాన్ని అందజేశానని మేకల కేదార్ యాదవ్ తెలిపారు. తను గత 33 సంవత్సరాల నుంచి ఎల్ఐసీ ఏజెంట్ గా హనుమకొండ బ్రాంచ్ ప్రధాన కార్యదర్శిగా, గౌరవ అధ్యక్షులు, డివిజన్ వైస్ ప్రెసిడెంట్ గా ఏజెంట్ల అసోసియేషన్లో పనిచేస్తున్నానన్నారు. ఈ మూడు జిల్లాల్లో ఉన్న 23 ఎల్ఐసీ బ్రాంచ్ లలో ఉన్న ఏజెంట్స్ అసోసియేషన్ ఏకగ్రీవంగా తీర్మానం చేసిందనీ తెలిపారు. రానున్న రెండు రోజుల్లో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్, జాతీయ నాయకులు కే లక్ష్మణ్ లను తన ఎల్ఐసి ఏజెంట్ల జోన్ నాయకులతో కలిసి ఎల్ఐసి ఏజెంట్ల పక్షాన ఎమ్మెల్సీగా భాజపా నుంచి పోటీ చేసే అవకాశం ఇవ్వాలని కోరబోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ బ్రాంచ్ గౌరవ అధ్యక్షులు బెజ్జంకి ఉపేంద్రం, కంటే కొమురయ్య, కుసుమ సత్యనారాయణ, కుంట శ్రీనివాస్ రాచకొండ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## రాష్ట్రపతిని కలిసిన హుస్సేన్ నాయక్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును శుక్రవారం జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ హుస్సేన్ నాయక్ ఢిల్లీలోని రాష్ట్రపతి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ గిరిజన అభివృద్ధి కోసం భారత ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని, భారతదేశంలో గిరిజనులకు ఎంతో ప్రాధాన్యత ఉందని, దానికి నిదర్శనమే రాష్ట్రపతిగా ఎస్టీ సామాజిక వర్గానికి చెందినవారు ఉండడం సంతోషకరమైన విషయమన్నారు. ఎస్టీ కమిషన్ నిధులతో గిరిజన ప్రాంతాలను అభివృధి చేస్తామని తెలిపారు.

## గీత కార్మికుడికి గాయాలు

**వరంగల్ వాయిస్, రేగొండ :** తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. రేగొండ మండలంలోని రంగయ్యపల్లి గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన బండి. రవిగౌడ్ అదే గ్రామంలోని తాటి వనంలోని తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా కాలు జారి కింద పడిపోయాడు. దీంతో తలకు శరీరానికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం పరకాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. కుటుంబ పెద్ద దిక్కు ప్రమాదానికి గురైన కారణంగా ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

# దోస్త్ నోటిఫికేషన్ విడుదల



## మే 6 నుంచి 25 వరకు తొలిదశ రిజిస్ట్రేషన్

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో డిగ్రీ కాలేజీల్లో ప్రవేశానికి ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి దోస్తు నోటిఫికేషన్ శుక్రవారం విడుదల చేశారు. మే 6 నుంచి 25 వరకు మొదటి ఫేజ్ రిజిస్ట్రేషన్ ఉండనుంది. రూ.200 రుసుంతో రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించారు. మే 15 నుంచి 27 వరకు 'దోస్త్' వెబ్ ఆప్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. జూన్ 3న మొదటి దశ సీట్ల కేటాయింపు.. జూన్ 4 నుంచి 10 లోపు సెల్ఫ్ రిపోర్టుకు అవకాశం కల్పించారు. రూ.400 రుసుంతో జూన్ 4 నుంచి 13 వరకు సెకండ్ ఫేజ్ రిజిస్ట్రేషన్ నిర్వహించనున్నారు. జూన్ 4 నుంచి 14 వరకు సెకండ్ ఫేజ్ వెబ్ ఆప్షన్లు ఉంటాయి. జూన్ 18న రెండో దశ సీట్ల కేటాయింపు జరుగుతుంది. జూన్ 19 నుంచి 24 వరకు సెల్ఫ్ రిపోర్టుకు అవకాశం కల్పించారు. జూన్ 19 నుంచి 25 వరకు 'దోస్త్'మూడో దశ రిజిస్ట్రేషన్ ఉండనుంది. రూ.400 రుసుంతో మూడో విడత రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించారు. జూన్ 19 నుంచి 25 వరకు మూడో దశ వెబ్ ఆప్షన్లు ఉంటాయి. జూన్ 29న మూడో దశ సీట్ల కేటాయింపు జరుగుతుంది. జులై 8 నుంచి డిగ్రీ కళాశాలల తరగతులు ప్రారంభమవుతాయి.

## డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలి





**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదెల్ల శరత్ డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని ఆ సంఘం సీకేఎం కాలేజ్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్ హాజరై మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ 2, 4, 6 సెమిస్టర్ పరీక్షలు ఈనెల 06 నుంచి 16.6.2024 వరకు నిర్వహించడానికి అధికారులు షెడ్యూల్ విడుదల చేశారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉన్నందున విద్యార్థులకు ఇబ్బంది కలుగుతుందన్నారు. ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకుకు పైగా నమోదవుతున్నందువల్ల ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని సెమిస్టర్ పరీక్షలు జూన్ రెండో వారానికి వాయిదా వేయడం జరిగిందన్నారు. కాబట్టి, కేయూ పరిధిలో ఉన్న అన్ని డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేసి విద్యార్థులను ఎండ దెబ్బకు గురి కాకుండా చూడాలని చెప్పారు. పరీక్షలను వాయిదా వేయాలని కాకతీయ యూనివర్సిటీ వీసీని కోరారు. కార్యక్రమంలో సాగర్, రమేష్, శివ, కుమార్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## ఎట్టకేలకు దిగి వచ్చిన అధికారులు



**వరంగల్ వాయిస్, కాజీపేట :** కడిపికొండ సర్వే నెంబర్ 46లో పేదలకు పంచిన ఇళ్ల స్థలాలలో కొందరు వ్యక్తులు అక్రమ నిర్మాణాలు చేపడుతూ, కబ్జా చేస్తుండడంతో స్థానిక బీజేపీ నాయకులు, మాజీ కార్పొరేటర్ నార్లగిరి రామలింగం సదరు భూమిపై విచారణ చేపట్టాలని అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఎట్టకేలకు రెవెన్యూ అధికారులు దిగివచ్చి సర్వే జరిపి భూమి సుమారుగా మూడు ఎకరాలు ఉండొచ్చనీ



తెలిపారని రామలింగం అన్నారు. అధికారులు ఎలక్షన్ల తర్వాత ఆ భూమి ఎంత ఉంది అనేది తెలియజేస్తామని అన్నారన్నారు. కనుక, ఆ సర్వే నెంబర్లు ఎలాంటి అక్రమ నిర్మాణాలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత స్థానిక మున్సిపల్ కమిషనర్, రెవెన్యూ డిపార్ట్ మెంట్, పోలీస్ ఉన్నతాధికారులదనీ బీజేపీ నాయకుడు, మాజీ కార్పొరేటర్ నార్లగిరి రామలింగం తెలియజేశారు.

# ఘనంగా నమో యువ సమ్మేళనం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ లోక్ సభ పరిధిలో భారతీయ జనతా పార్టీ యువ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన నమో యువ సమ్మేళనం కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర నాయకుడు వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర బీజేవైఎం ప్రభారి కాసం వెంకటేశ్వర్లు, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, వరంగల్ లోక్ సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్, క్లస్టర్ ఇంచార్జి, మాజీ శాసనసభ్యుడు మార్తినేని ధర్మారావు, వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్, హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, పార్లమెంట్ ప్రభారి మురళిధర్, పార్లమెంట్ కన్వీనర్ తాళ్లపల్లి కుమారస్వామి, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండేటి శ్రీధర్, బీజేపీ కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్, రాష్ట్ర బీజేవైఎం పదాధికారులు, జిల్లా బీజేవైఎం పదాధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** ఈ నెల 13న జరిగే వరంగల్ లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ లోక్ సభ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశశ్విని రెడ్డిల ఆదేశాల మేరకు వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కావ్య గెలుపు కోసం మండలంలోని మడిపల్లి గ్రామంలో గ్రామ శాఖ అధ్యక్షుడు వెన్నం సోమిరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సంతోష్ మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులకు డిపాజిట్ దక్కకుండా చిత్తుచిత్తుగా ఓడించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కావ్యను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయమన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం గ్రామాలలో కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఇంచార్జి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు మెరుగు మల్లేశం గౌడ్, కాంగ్రెస్ నాయకులు మహంకాళి సాయి మల్లు, వేర్పుల వెంకన్న, వెంకటేశ్వర్లు, జగన్, యాదిరెడ్డి, మీనారెడ్డి, బుచ్చిరెడ్డి, కమ్మగాని వెంకన్న, చల్లా రవి, భార్గవ్, కిరణ్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి ఇబ్బందులపై విచారణ



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** కొత్తగూడ ఏజెన్సీ జంగవానిగూడెం గ్రామ పంచాయతీలోని సరసన్నపల్లి ఆవాసం తాగునీటి ఇబ్బందులపై జిల్లా పంచాయతీ అధికారి జె.హరిప్రసాద్, మిషన్ భగీరథ ఈఈ (ఎంబీ) ఇంట్రా ఎం.క్రిష్ణా రెడ్డి, ఈఈ (ఎంబీ) గ్రిడ్ ఏ.సురేందర్ శుక్రవారం సందర్శించి పరిశీలించారు. ఆ గ్రామంలో ఉన్న 28 ఇండ్లలోని 100 మంది జనాభాకు సరిపడా ఇంట్లోని ప్రతి మనిషికి 100లీటర్ల చొప్పున తాగునీరు సరఫరా జరుగుతుందని, ఒక బోర్ ద్వారా కూడా అదనంగా నీటి సరఫరా చేయబడుతుందని విచారణలో కుంటనీరు వాడటం లేదని తెలిసింది. పశువులకు, మేకలకు అదనంగా ఒక బోరు వేయాలని, కుంట నుంచి బిందెలతో నీరు తెచ్చుకున్నట్లుగా అలా చేసినట్లు తెలియపరిచారు. ప్రజల తాగునీటి కోసంఎటువంటి ఇబ్బందులు లేవని అధికారులు తెలియజేశారు. డీఎల్ పీఓ, ఎంపీడీఓ, ఎంపీఓ, పంచాయతీ సెక్రటరీ పాల్గొన్నారు.

## మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం 18 మంది మైనర్ డ్రైవ్ చేసే వ్యక్తులను గుర్తించి వారిపై జువెనైల్ కోర్టులో చార్జెషీట్స్ ఫైల్ చేయగా వారికి ఒక రోజు బాలల అబ్జర్వేషన్ హోమ్ కు తరలించారు. ఇకపై వాహనాలు నడిపే మైనర్లను పట్టుకొని ఛార్జ్ షీట్ ఫైల్ చేసి కోర్టు ముందు హాజరు పరచడం జరుగుతుందని వరంగల్ ట్రాఫిక్ సీఐ కె. శ్రీధర్ తెలిపారు

## 10 లోగా పనులు పూర్తి చేయాలి



**వరంగల్ వాయిస్, పరకాల :** ఈనెల 13న లోక్ సభ ఎన్నికల పోలింగ్ జరుగనున్ననేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం పరకాల మున్సిపాలిటీ పరిధిలోని పోలింగ్ స్టేషన్లను మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, మండల పంచాయతీ అధికారి కలిసి పరిశీలించారు. కొన్ని పాఠశాలలో పనులు ఇంకా పూర్తి కానందున సంబంధిత ప్రధానోపాధ్యాయులు, టీఎల్ఎఫ్ లను 10న లోపల పనులు పూర్తి చేయవలసిందిగా ఆదేశించడం జరిగింది.


వరంగల్ వాయిస్ సినిమా
శుక్రవారం 03, మే 2024
7

# యశ్ హీరోగా 'టాక్సిక్'



యశ్ హీరోగా 'టాక్సిక్' చిత్రాన్ని ప్రకటించి చాలా రోజులవుతోంది. దీనికి సంబంధించి అప్‌డేట్స్ రాకపోయినా.. తరచూ ట్రెండింగ్‌లోనే ఉంటోంది. ఇటీవల ఇందులోని హీరోయిన్ల గురించి పలు వార్తలు సోషల్ మీడియాలో వైరల్ కాగా.. తాజాగా దీని షూటింగ్‌కు సంబంధించిన ఓ అప్‌డేట్ నెట్టింట షేర్ అవుతోంది. ఇటీవలే దీని షూటింగ్ ప్రారంభించారని.. ప్రస్తుతం కర్ణాటకలో శరవేగంగా జరుగుతోన్నట్లు సమాచారం. ఈ సినిమాను కూడా 'కేజీఎఫ్' లాగా రెండు భాగాలుగా విడుదల చేయాలని భావిస్తున్నారట. త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన రానుందంటున్నారు. ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర కూడా ప్రధానమైనది కావడంతో అగ్ర నటీమణులను తీసుకోవాలని చిత్రబృందం బావిస్తోంది. ఇప్పటికే ఇందులో నటించనున్నట్లు ముగ్గురు హీరోయిన్ల పేర్లు తెరపైకి వచ్చాయి. బాలీవుడ్ నటి కరీనాకపూర్, కియారా అద్వాణీ, శ్రుతి హాసన్‌లను పరిశీలిస్తున్నారని జోరుగా ప్రచారం జరుగుతోంది. 'కేజీఎఫ్' లాంటి సూపర్ హిట్ చిత్రాల తర్వాత యశ్ నటిస్తోన్న చిత్రమే 'టాక్సిక్'. ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్.. అన్నది ఉపశీర్షిక. మలయాళీ నటి, దర్శకురాలు గీతూమోహన్ దాస్ దీనిని తెరకెక్కిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో భారీ బ్జడెట్‌తో కె.వి.ఎన్. ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంస్థలు నిర్మిస్తున్నాయి. యాక్షన్ ప్రియులను అలరించే కథాంశంతో ఇది సిద్ధమవుతోన్నట్లు సమాచారం. 2025 ఏప్రిల్ 10న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

# పొలిటికల్ డ్రామాగా జితేందర్ రెడ్డి



ముదుగంటి క్రియేషన్స్ పై ముదుగంటి రవీందర్ రెడ్డి నిర్మాతగా ఉయ్యాల జంపాల, మజ్ను సినిమాలతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న విరించి వర్మ దర్శకత్వంలో పేక మేడలు సినిమాతో నిర్మాతగా బాహుబలి, ఎవరికి చెప్పొద్దు వంటి సినిమాలతో నటుడిగా పేరు తెచ్చుకున్న రాకేష్ వర్రె లీడ్ రోల్ లో నటించిన సినిమా జితేందర్ రెడ్డి 1980 కాలంలో జరిగిన వాస్తవిక సంఘటనలు ఆధారంగా పొలిటికల్ డ్రామాగా ఈ సినిమా తెరకెక్కుతోంది. వైశాలి రాజ్, రియా సుమన్, చత్రపతి శేఖర్, సుబ్బరాజు మరియు రవి ప్రకాష్ ఇతర ముఖ్య పాత్రలో నటించారు. గతంలో ఈ సినిమాకి సంబంధించిన టైటిల్ ఫస్ట్ లుక్ పోస్టర్లు, గ్లిమ్స్, టీజర్ సినిమా పై అంచనాలను పెంచేసాయి. కాగా ఈ సినిమాకి సంబంధించిన ట్రైలర్ రిలీజ్ చేశారు. చిన్నప్పటినుండే సమాజం పట్ల అంకితభావం ఉన్న జితేందర్ రెడ్డి , సమాజానికి ఏదో ఒక మంచి చెయ్యాలి అనే భావంతో పెరుగుతాడు. ఆ లక్షణాలు జితేందర్ రెడ్డితో పాటు పెరిగి, కాలేజీ ఎలక్షన్స్ లో లీడర్ గా ఎదిగి, ఆ తరవాత పోలీసు వ్యవస్థకు దీటుగా, సమాజంలో నక్సలైట్లు చేసే దౌర్జన్యాలకు ఎదురు వెళ్తాడు, ట్రైలర్ మధ్యలో హిందుత్వం వంటి డైలాగ్ లు మరింత ఆశక్తి పెంచేలా ఉన్నాయి.1980' ఒక వ్యక్తి జీవితంలో జరిగే కాలేజీ పాలిటిక్స్, ఆ తరవాత నిజమైన రాజకీయాలు నేపథ్యంలో ఈ కథ సాగుతున్నట్టు ఉంది. మొత్తానికి కంటెంట్ మాత్రం ప్రోమిసింగ్ గా ఉంది, మే 10న 'జితేందర్ రెడ్డి విడుదల కాబోతుంది అని చిత్ర యూనిట్ ట్రైలర్ ద్వారా తెలిపారు. లవ్ స్టోరీస్ డైరెక్ట్ చేసిన విరించి వర్మ ఇలాంటి ఒక యాక్షన్ సినిమా చేసారా అంటే అస్సలు నమ్మేలా లేదు, విరించి దర్శకత్వంలో మరో కోణం ఈ జితేందర్ రెడ్డితో భయటకి వస్తుందేమో చూడాలి.



# వినోదాత్మకంగా సాగిన ఆ ఒక్కటీ అడక్కు

ఇటు కామెడీ, అటు సీరియస్ కథలతో అలరించే హీరో అల్లరి నరేష్. కొన్నాళ్ళుగా సీరియస్ కథపై దృష్టి పెట్టిన ఆయన.. తనకు గుర్తింపు తీసుకొచ్చిన కామెడీ జోనర్ లో 'ఆ ఒక్కటీ అడక్కు'తో ఇప్పుడు ప్రేక్షకులు ముందుకు వచ్చారు. మల్లి అంకం ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమయ్యారు. టీజర్, ట్రైలర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచాయి. ఈ సినిమా కోసం ఈవీవీ క్లాసిక్ టైటిల్ ని వాడుకోవడం మరో విశేషం.గణపతి అలియాస్ గణ (అల్లరి నరేష్) సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అధికారి. జీవితంలో స్థిరపడినప్పటికీ తనకి ఇంకా పెళ్లి కాదు. సంబంధాలు వచ్చినట్టే వచ్చి రిజెక్ట్ అవుతుంటాయి. తన తమ్ముడికి కూడా పెళ్లయిపోయింది. కానీ తాను పెళ్లి కోసం ప్రయత్నాలు చేస్తూనే వుంటాడు. చివరి ప్రయత్నంగా హ్యాపీ మాట్రిమోనీని సంప్రదిస్తాడు. అక్కడివారు చూపిన మ్యాచ్ లో గుణకి సిద్ది (ఫరియా అబ్దుల్లా)తో పరిచయం అవుతుంది. తొలి చూపులోనే బాగా నచ్చుతుంది. కానీ సిద్దికి మాత్రం తనకు ఇంకా తొమ్మిది ఆప్షన్స్ వున్నాయని, అవన్నీ చూశాకే ఒక నిర్ణయానికి వస్తానని గుణని వెయిటింగ్ లిస్టు లో పెట్టేస్తుంది. మరి సిద్ది, గుణతో పెళ్ళికి అంగీకరించిందా? అసలు సిద్ది ఎవరు ? జీవితంలో సెటిల్ అయిపప్పటికీ గణకి వివాహం ఎందుకు ఆలస్యం అవుతుంది ? చివరికి గణ పెళ్లి చేసుకున్నాడా లేదా ? అనేది మిగతా కథ. పెళ్లి అనేది ఒక ఎమోషనల్ బాండ్. ఈ ఎమోషన్ ని క్యాష్ చేసుకొని కొన్ని మ్యాట్రీమోనీ కంపెనీలు ఎలాంటి మోసాలకు పాల్పడుతున్నాయి. పెళ్లి విషయంలో ఎంత జాగ్రత్తగా ఉండలానే అంశాలని వినోదాత్మకంగా చెబుతూనే మంచి సందేశం ఇచ్చిన చిత్రమిది. గణ పెళ్లి చూపులతో మొదలైన కథ ఆహ్లాదకరమైన నవ్వులు పంచుతూ ముందుకు సాగుతుంది. గణ మాట్రిమోనీలో జాయిన్ అవ్వడం, అక్కడ స్కీములు, హీరోయిన్ పరిచయం, ఇవన్నీ హిలేరియస్ గా ముందుకు సాగుతాయి. ఇంటర్వెల్ కు ముందు వచ్చిన ట్విస్ట్ బావుంది. సెకెండ్ హాఫ్ లో మాట్రిమోనీ పేరుతో జరుగుతున్న మోసాలు ఒకొక్కటీ వెలుగులోకి తీసుకురావడం, హీరో, హీరోయిన్ ఎమోషన్స్, చివర్లో కోర్ట్ రూమ్ డ్రామా ఇవన్నీ ప్రేక్షకులకు వినోదం పంచుతూనే ఆలోజింపచేసేలా వుంటాయి. గణ పాత్రలో నరేష్ లుక్ కొత్తగా హుందాగా వుంటుంది. కామెడీ సీన్స్ లో నవ్విస్తూనే ఎమోషనల్ సీన్స్ లో హత్తుకున్నారు. ఫారియా నరేష్ కి జోడిగా యాప్ట్. అందం అభినమయంతో ఆకట్టుకుంది. నరేష్ మరదలి పాత్రలో నటించిన జామీ లివర్ నవ్వులు పంచింది. మురళీ శర్మ, అజయ్, అనీష్ కురువిల్ల, రాజీవ్ కనకాల, రఘుబాబు, గోపరాజు రమణ పరిధిమేర కనిపించారు. గౌతమి జడ్జ్ గా గెస్ట్ రోల్ పోషించారు. గోపిసుందర్ మ్యూజిక్ ఈ సినిమాకి మరో ఆకర్షణ. పాటలు కలర్ ఫుల్ గా చిత్రీకరించారు, నేపధ్య సంగీతం ఎమోషన్ ని ఎలివేట్ చేసింది. కెమరాపనితనం బావుంది. నిర్మాణ విలువలు ఉన్నతంగా వున్నాయి. అబ్బూరి రవి రాసిన మాటలు ఎమోషనల్ గా కనెక్ట్ అవుతాయి.

# ఓటిటిలోకి వచ్చిన ఫహాద్ ఫాజిల్ మూవీ



ఇటీవల మళయాళం విడుదలై సంచలన విజయం సాధించిన అవేశం చిత్రం ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు రెడీ అయింది. పుష్ప చిత్రంలో విలన్‌గా ఆకట్టుకున్న ఫహాద్ ఫాజిల్ హీరోగా వచ్చిన ఈ సినిమా ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలై కేరళలో రికార్డుల సృష్టించింది. రూ వంద కోట్లకు పైగా కలెక్షన్లు కొల్లగొట్టింది. ఈ ఏడాది ప్రేమలు, మంజమ్మల్ బాయ్స్, ది గోట్ లైఫ్ సినిమాల తర్వాత రూ.100 కోట్ల మార్క్‌ను దాటిన చిత్రంగా పేరు తెచ్చుకుంది. అంతేగాక ఫహద్ కేరీర్‌లోనే ఈ ఘనత సాధించిన మొదటి చిత్రంగా అవేశం చరిత్ర సృష్టించింది. గ్యాంగ్ స్టర్ కథకు కామెడీని, మదర్ సెంటిమెంట్‌ను జోడిస్తూ తెరకెక్కిన ఈ చిత్రం ఆద్యంతం ప్రేక్షకులను వీపరీతంగా అలరించింది. బీటెక్ చదవడానికి కేరళ నుంచి బెంగళూరుకు వచ్చిన ఓ ముగ్గురు మిత్రులను సీనియర్లు ర్యాగింగ్ చేస్తూ ఇబ్బంది పెడుతుంటారు. దీన్ని భరించలేని ఈ ముగ్గురు ఫ్రెండ్స్ ఓ గ్యాంగ్‌స్టర్ ను కలిసి అతని సాయంతో సీనియర్లపై తిరగబడతారు. ఆ తర్వాత నుంచి ఆ గ్యాంగ్‌స్టర్‌తో కలిసిపోతారు. చివరకు ఈ ముగ్గురు మిత్రులు గ్యాంగ్‌స్టర్‌ను చంపేందుకు ఎందుకు ప్లాన్ చేశారనే ఆసక్తికరమైన పాయింట్‌తో సాగుతూ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తుంది. నటుడు ఫహాద్ ఫాజిల్ స్వయంగా సుమారు రూ. 20 కోట్లతో ఈ చిత్రాన్ని నిర్మించగా వంద కోట్లకై పైగా వసూళ్లను రాబట్టింది. అయితే ఇప్పుడు ఈ సినిమా మే 9 గురువారం నుంచి అమెజాన్ ప్రైమ్ వీడియోలో మలయాలంతో పాటు తెలుగు, కన్నడ, తమిళ భాషల్లోనూ స్ట్రీమింగ్‌కు తీసుకు వస్తున్నారు. గతంలో రోమాంచం వంటి సూపర్ మిట్ చిత్రాన్ని అందించిన జీతూ మాధవన్ ఈ సినిమాకు దర్శకత్వం వహించారు.



# కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

**ఎన్నికల్లో బూత్ కమిటీలే కీలకం**

**సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించే బాధ్యత వారిదే**

**కాంగ్రెస్ పార్టీ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి కడియం కావ్య**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కేంద్రంలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ఆ పార్టీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య జోస్యం చెప్పారు. ప్రజలనుంచి కాంగ్రెస్ పార్టీకి మంచి ఆదరణ లభిస్తోందన్నారు. హనుమకొండ జిల్లా పరిధిలోని ఎర్రగట్టు గుట్ట కేఎల్ ఎన్ కన్వెన్షన్ లో శుక్రవారం వర్ధన్నపేట శాసన సభ్యులు కేఆర్ నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన హసన్ పర్తి మండల బూత్ కమిటీల సమావేశంలో స్టేషన్ ఘన్ పూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరితో కలిసి కడియం కావ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా కావ్య మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బూత్ కమిటీ సభ్యులే కీలకం అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి కాంగ్రెస్ కు ఓటు వేయించే బాధ్యత వారిదే అన్నారు. వర్ధన్నపేట అభివృద్ధిని పక్కన బెట్టి భూ కబ్జాలపై దృష్టి పెట్టిన అరూరి రమేష్ కు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకే బీజేపీలో చేరిన ఆయనకు మరోసారి బుద్ధి చెప్పాలని కోరారు. కేంద్రంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తే మతతత్వం పెరిగిపోతుందని, సామాన్యులు జీవించే పరిస్థితి లేకుండా పోతుందన్నారు. అందుకే లోక్ సభ ఎన్నికల్లో బీజేపీకి బుద్ధి చెప్పి, కాంగ్రెస్ ను అధికారంలో తీసుకురావాలన్నారు. మీ ఇంటి బిడ్డగా నిండు మనసుతో ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపించాలిని కోరారు.

అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ ఎన్నికలు పూర్తి కాగానే శ్రీరాం సాగర్, దేవాదుల కాల్వల ద్వారా రెండు పంటలకు సాగు నీరు అందించే బాధ్యత నేను తీసుకుంటానంటూ హామీ ఇచ్చారు. మడికొండ డంపింగ్ యార్డు తరలింపు విషయంలో నాపై దుష్ప్రచారం చేస్తున్నారని, అంత అవగాహన లేకుండా నేను మాట్లాడనన్నారు. జనవాసాలకు దూరంగా డంపింగ్ యర్డ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానన్నారు. ల్యాండ్ పూలింగ్ పేరుతో ఓ ఆర్ ఆర్ చుట్టూ ఉన్న రైతుల భూములను లాక్కున్న అరూరిని చిత్తు చిత్తుగా ఓడించాలన్నారు. మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య చేతి గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు దొమ్మటి సాంబయ్య, పెరుమాండ్ల రామకృష్ణ, స్థానిక కార్పొరేటర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, బూత్ కమిటీ సభ్యులు కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ప్రచారంలో దూకుడు..

వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య శుక్రవారం వరంగల్ ఓసిటీ గ్రౌండ్, ఖిలా వరంగల్ గ్రౌండ్‌లో వాకర్లతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉదయాన్నే గ్రౌండ్‌కు వెళ్లి వాకర్లు, ఎంప్లాయిస్, రిటైర్డ్ ఎంప్లాయిస్, సీనియర్ సిటిజన్లు, యువతను కలిశారు. వారితో కలిసి వాకింగ్ చేశారు. క్రికెట్ ఆడి క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు. అనంతరం అక్కడే కూరగాయలు అమ్మే వ్యాపారులతో ముచ్చటించారు. యువత ఆలోచించి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు..

జనగామ జిల్లా లింగాల ఘనపూర్ మండలం పటేల్ గూడెంకు చెందిన దాదాపు 100 మంది మాజీ ఎంపీపీ బోయిని రాజు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి స్టేషన్ ఘన్ పూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యను అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు అహర్నిశలు కష్టపడతామని వారు తెలిపారు. పార్టీలో చేరినవారిలో మండల అధ్యక్షులు నీల గోపాల్ ముదిరాజ్, గ్రామ శాఖ అధ్యక్షులు పొన్నాల బుచ్చిరెడ్డి, మాజీ సర్పంచ్ శేఖర్ రెడ్డి, పెండ్లి కరుణాకర్, సీనియర్ నాయకులు రమేష్, సుధాకర్, వెంకటయ్య, గోపాల్, మల్లయ్య, రామచంద్రయ్య, రాజయ్య, కిష్టయ్య, శేఖర్, నాగరాజు, సన్నీ, సత్యనారాయణ, రాములు, లక్ష్మారెడ్డి, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

# జర భద్రం..

**జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ హెచ్చరిక**

**ఎండ తీవ్రతకు గురికాకుండా జాగ్రతలు పాటిద్దాం**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వాతారణశాఖ వారి హెచ్చరికల మేరకు జనం జర భద్రంగా వ్యవహరించాలని హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.సాంబశివ రావు ఒక ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాలో ఎండ తీవ్రత చాలా ఎక్కువగా ఉందని, వడ గాలులతో 'వడదెబ్బ'కు గురయ్యే అవకాశం ఉందన్నారు.

- వేసవికాలంలో వడ దెబ్బకు గురైనప్పుడు శరీర ఉష్ణోగ్రత తీవ్రంగా పెరగడం, తీవ్రమైన తలనొప్పి, నాలుక ఎండి పోవడం, శరీరంలో నీటి శాతం కోల్పోవడం (తగ్గడం), మూత్రం గాఢ పసుపు రంగులో ఉండి మంట రావడం, పాక్షిక లేదా పూర్తి అపస్మారక స్థితిలోకి వెళ్ళే అన్ని లక్షణాలు గాని లేక కొన్ని లక్షణాలు గాని కనిపిస్తాయని పేర్కొన్నారు.
- వడదెబ్బకు గురైన వ్యక్తిని వెంటనే నీడ ప్రదేశానికి తరలించి శరీరాన్ని చల్లని నీటిలో మంచిన గుడ్డతో తుడవాలి. వారికి ఉప్పు కలిపిన మజ్జిగ, కొబ్బరినీళ్లు, నిమ్మరసం, గ్లూకోజ్, ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగించాలి. సత్వర చర్యల కొరకు 108 అత్యవసర సేవలను సంప్రదించాలి.
- ప్రథమ చికిత్స చేసిన తరువాత దగ్గరలోని ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాలి.
- ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు బయట తిరగడం, ఆడటం చేయరాదు. తప్పనిసరి పరిస్థితుల్లో ఎండలోకి వెళితే గొడుగు, టోపీ, తెల్లని రుమాలు తప్పక ధరించాలి. తెల్లని నూలు వస్త్రాలు ధరించాలి. తాగు నీరు ఇతర ద్రవ పదార్థాలు వీలైనంత ఎక్కువగా తీసుకోవాలి. మత్తు పానీయాలు తీసుకోరాదు.
- ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు, ఇతర అనారోగ్యంతో బాధపడేవారు వేసవి కాలంలో జాగ్రత్తగా ఉండాలి. అలాగే బయట పనికి వెళ్ళేవారు ఉదయం, సాయంత్రం వేళల్లో పనిచేసుకొని మధ్యాహ్నం విశ్రాంతి తీసుకోవాలన్నారు.
- ప్రతి ఆరోగ్య కేంద్రం, ఉప కేంద్రం, అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులు, గ్రామ పంచాయతీల్లో ఉచితంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్నారు. అవసరం ఉన్నవారు ఉపయోగించుకోవాలి.
- ఎన్నికల విధులు, ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనే వారు తగిన వ్యక్తి గత జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.సాంబశివ రావు తెలిపారు.



# మేడారానికి జాతీయ హోదా

**ఏపీలో కలిపిన ఐదు మండలాలు వెనక్కి**

**యువత, మహిళలు, రైతులు, కార్మికులకు న్యాయం**

**విభజన హామీల అమలుకు కృషి**

**తెలంగాణకు ప్రత్యేక మేనిఫెస్టో విడుదల విడుదల చేసిన దీపాదాస్ మున్షీ**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** అసెంబ్లీ ఎన్నికలకు ఆరు గ్యారంటీలతో పాటు బోలెడన్ని హామీలతో మేనిఫెస్టో రిలీజ్ చేసిన కాంగ్రెస్ పార్టీ తాజాగా లోక్ సభ ఎన్నికలకు కూడా తెలంగాణకు ఏమి చేస్తారో తెలియజేస్తూ ప్రత్యేకంగా ఓ మేనిఫెస్టో రిలీజ్ చేసింది. అయితే ఢిల్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే ఏమేమి చేస్తారో ఇందు పొందుపర్చారు. మేనిఫెస్టో తెలుగు ప్రతిని గాంధీభవన్‌లో శుక్రవారం కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి దీపాదాస్ మున్షీ విడుదల చేశారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ ముఖ్య నేతలు పాల్గొన్నారు. అన్ని వర్గాలను దృష్టిలో పెట్టుకొని 23 అంశాలతో మేనిఫెస్టో తయారు చేసినట్లు మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. కేంద్రంలో అధికారంలోకి రాగానే విభజన చట్టం హామీలు అమలు చేస్తామని ప్రకటించారు. క్రీడలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తామని, యువతకు వివిధ యూనివర్సిటీలను అందుబాటులోకి తెస్తామన్నారు. మేడారం జాతరకు జాతీయ హోదా కల్పిస్తామని చెప్పారు. సుప్రీం కోర్టు ప్రత్యేక బెంచ్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయిస్తామని పేర్కొన్నారు. ఏపీలో కలిపిన ఐదు గ్రామాలను తిరిగి రాష్ట్రంలో విలీనం చేస్తామన్నారు. పాలమూరు–రంగారెడ్డికి జాతీయ హోదా కల్పిస్తామని తెలిపారు. నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు పెంచుతామన్నారు. తెలంగాణ వ్యాప్తంగా ఐదు ఇండస్ట్రియల్ కారిడార్లు ఏర్పాటు చేయనున్నట్లు స్పష్టం చేసింది. ఇందులో హైదరాబాద్ నుంచి బెంగళూరు వరకు ఐటీ అండ్ ఇండస్ట్రియల్ కారిడార్ ముఖ్యమైనదని పేర్కొన్నారు. రాష్ట్ర అవసరాలు ఆలోచించి మరీ మేనిఫెస్టో తయారు చేశామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు, మేడారం జాతరకు జాతీయ హోదా కల్పిస్తామని చెప్పారు. ఈ మేనిఫెస్టోను యువత, మహిళలు, రైతులు, కార్మికులకు న్యాయం జరిగేలా రూపొందించి నట్లు కాంగ్రెస్ నేతలు తెలిపారు. అన్నివర్గాలతో మాట్లాడి మేనిఫెస్టో తయారు చేశామని వెల్లడించారు. గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేసిందిని.. ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. తెలంగాణలో అంతర్జాతీయ ప్రమాణాలతో సాంస్కృతిక, వినోద కేంద్రం ఏర్పాటు, గతంలో ఇచ్చిన హామీ మేరకు ఐటీఐఆర్ ప్రాజెక్టు ప్రారంభం, నాలుగు సైనిక పాఠశాలలు ఏర్పాటు, కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాల ఏర్పాటు, కేంద్ర నిధులు నేరుగా స్థానిక సంస్థలకు అందేలా చూడటం, సౌరశక్తి ఉత్పత్తి ప్రోత్సాహం ఇస్తామని ప్రకటించారు. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని.. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ నిర్మాణం జరుపుతామని ప్రకటించారు. రాష్ట్రంలో మైనింగ్ విశ్వవిద్యాలయం ఏర్పాటు రామగుండం–మణుగూరు కొత్త రైల్వే ల్కైను ఏర్పాటు, రాష్ట్రంలో క్రీడా యూనివర్సిటీ ఏర్పాటు వంటి హామీలను ఇచ్చారు. కార్యక్రమంలో మేనిఫెస్టో కమిటీ చైర్మన్, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, అజారుద్దీన్, అంజన్ కుమార్ యాదవ్, చిన్నారెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ పాల్గొన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు.. ప్రతి గడపకు మేనిఫెస్టోను తీసుకెళ్లాలని సూచించారు.

# ఓట్ ఫర్ ష్యూర్

**వినియోగదారుల సమాచార కేంద్రం ఆధ్వర్యంలో ఓటరు చైతన్య కార్యక్రమం**

**వరంగల్ వాయిస్, కేయూ :** హనుమకొండ జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం అధ్యక్షుడు రతన్ సింగ్ ఠాగూర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఓటర్ చైతన్యంపై కార్యక్రమం నిర్వహించారు. ఓట్ ఫర్ ష్యూర్ 100శాతం ఓటు వినియోగం అనే కార్యక్రమంలో భాగంగా కాకతీయ యూనివర్సిటీలో వాకర్స్ కు అవగాహన కల్పించారు. ముఖ్యంగా గత లోకసభ ఎన్నికల్లో హనుమకొండ సిటీలో అతి తక్కువ ఓటింగ్ శాతం నమోదైందన్నారు. త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎక్కువ శాతం ఓటింగ్ లో పాల్గొనేలా చైతన్య కార్యక్రమం నిర్వహించారు. ఓటు వజ్రాయుధమని దాని ద్వారా దేశ భవిష్యత్తును మార్చవచ్చంటూ హితవు పలికారు. ప్రతి ఒక్కరూ తమ ఓటును 100 శాతం వినియోగించుకోవాలని రతన్ సింగ్ కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కొడిమాల శ్రీనివాసరావు, కన్జ్యూమర్ ఆర్గనైజేషన్ సభ్యులు బండ కాళిదాసు, విజయరావు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com